సాక్షి అనకాపల్లి

శుక్రవారం ၊ 21 ၊ ఫిబ్రవరి ၊ 2025



'కొత్తపల్లి' అందాలకు ఫిదా

పీఎం జన్‌మన్ కేంద్ర కమిటీ బృందం గురువారం కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించింది. 8లో



జీడి చెట్ల నరికివేత

వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన భూమిలో అధికార పార్టీకి చెందిన వ్యక్తి అక్రమంగా జీడిచెట్లను నరికివేయించాడు. 8లో

విశాఖలో హైకోర్టు బెంచ్ కోరుతూ 23న సదస్సు

విశాఖ లీగల్: విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 23వ తేదీన జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ నూతన కార్యాలయంలో సదస్సు నిర్వహించనున్నట్లు విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్య నారాయణ తెలిపారు.

వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



మాజీ సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ గొల్ల బాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేష్ కన్నబాబురాజు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తదితరులు

- ఎయిర్‌పోర్టు లాంజ్‌లో కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయన తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు మధ్యాహ్నం 12.42 గంటలకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో భేటీ అయ్యారు. అనంతరం 1.19 గంటలకు హెలికాప్టర్‌లో మన్యం పార్వతీపురం జిల్లా పాలకొండకు బయలుదేరారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించి తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు 4.13 గంటలకు చేరుకున్నారు. ఇక్కడ నుంచి 6.20 గంటలకు విమానంలో బెంగుళూరుకు బయలుదేరారు. జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికినవారిలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కె.కె.రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, ముఖ్యనేతలు జి.వెంకటేశ్వరరావు, బొడ్డేడ ప్రసాద్, గొలగాని శ్రీనివాస్, ఈర్లె అనురాధ, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, రేయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, వంశీరెడ్డి, రాష్ట్ర జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు జాన్‌వెస్లీ, పేడాడ రమణకుమారి, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, పీలా వెంకటలక్ష్మి, పైలా శ్రీనివాసరావు, దొడ్డి కిరణ్, జీలకర్ర నాగేంద్ర ఉన్నారు. జగన్‌తో పాటు పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, కృష్ణమోహన్‌రెడ్డి ఉన్నారు.



ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా వివిధ విభాగాల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీచేశారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా పెతకంశెట్టి శివసత్యనారాయణ(జోసెఫ్), విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షునిగా బొడ్డపల్లి హేమంత్‌కుమార్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షునిగా కడిమిశెట్టి సతీష్, జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా బెల్లాన అనురాధ, జిల్లా ఐటీ వింగ్ విభాగం అధ్యక్షునిగా పల్లెల వెంకట సీతమ్మదొర, జిల్లా వైద్య విభాగం అధ్యక్షునిగా దండా సిద్దార్థ, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షునిగా కరణం సురేష్ నియమితులయ్యారు.

స్పీకర్‌ని కలిసిన క్రైమ్ అడిషనల్ ఎస్పీ



స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు

నర్సీపట్నం : శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లాలో క్రైమ్ రేటు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని స్పీకర్ సూచించారు. వాహనదారులు అతివేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ వెంట క్రైమ్ సీఐ అప్పలనాయుడు, టౌన్ సీఐ గోవిందరావు ఉన్నారు.

కుంభమేళాలో మలసాల పుణ్యస్నానాలు



కుటుంబ సభ్యులతో కలసి పుణ్య స్నానాలు ఆచరిస్తున్న మలసాల భరత్‌కుమార్

కశింకోట: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం ప్రయాగరాజ్‌లో నిర్వహిస్తున్న మహా కుంభమేళకు హాజరై గురువారం కుటుంబ సభ్యులతో పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ మేరకు ఇక్కడకు సమాచారం పంపారు. పార్టీ యువనాయకుడు మలసాల కుమార్ రాజా కూడా పాల్గొన్నారు.

ఆవు కడుపులో 50 కిలోల పాలిథిన్

- శస్త్రచికిత్స చేసి, బయటకు తీసిన పశువైద్యుడు

తగరపువలస (విశాఖ): ఆనందపురం మండలం వేములవలసలో ఓ ఆవు పొట్ట నుంచి గురువారం 50 కిలోల పాలిథిన్‌ను పశువైద్యుడు బయటకు తీశారు. పాడి రైతు కోరాడ నాయుడుబాబుకు చెందిన ఈ ఆవు ఐదు రోజులుగా కడుపులో నొప్పి, మేత తినలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతోంది.

ఇది గమనించిన రైతు ఆనందపురం పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌ను సంప్రదించారు. ఆవును పరీక్షించి, రుమేనటమీ శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. గురువారం డాక్టర్, అతని బృందం శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆవు కడుపు నుంచి దాదాపు 50 కిలోల పాలిథిన్ కవర్లు, తాళ్లను వెలికితీశారు. పాలిథిన్ వ్యర్థాలు పశువులకు ఎంత ప్రమాదకరమో ఈ సంఘటన తెలియజేస్తుందని డాక్టర్ అన్నారు. పాలిథిన్ కారణంగా మూగజీవాలు మృత్యువాత పడకుండా ఉండాలంటే.. ప్రజలు పాలిథిన్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. పశువైద్య సిబ్బంది సుజాత, దుర్గ, లక్ష్మి, రమణ, సంతోష్, సాగర్, సుబ్రహ్మణ్యం, నర్సింగ్ డాక్టర్ అనిల్‌కుమార్‌కు సహకరించారు.

పేదల ఇళ్లపై కమీషన్ల దందా!



అచ్చెర్ల గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ జగనన్న కాలనీ ఇళ్లు



విశాఖలోనే రూ.5 కోట్లకుపైగా కలెక్షన్

- ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున వసూలు
- కాంట్రాక్టర్లకు గృహ నిర్మాణ శాఖ అధికారుల హుకుం
- లేదంటే బిల్లులు నిలిపేస్తామని బెదిరింపులు
- దుకాణం తెరిచిన నామినేటెడ్ పోస్టులోని కూటమి నేత
- కాంట్రాక్టర్లతో నేరుగా డీలింగ్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

పేదల ఇళ్ల నిర్మాణాలపై కూటమి నేతలే కాదు అధికారులు కూడా గెద్దల్లా వాలిపోతున్నారు. ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున ఇస్తేనే బిల్లులు చేస్తామంటూ కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు తెగబడుతున్నారు. గృహ నిర్మాణ శాఖకు చెందిన ఓ అధికారి కాంట్రాక్టర్లకు ఆదేశాలు కూడా జారీ చేసేశారు. ఒకవేళ అడిగిన మొత్తం ఇవ్వకపోతే బిల్లులు చేసేది లేదని తెగేసి చెప్పినట్టు సమాచారం. తమకు వారం వారం బిల్లులు నిలిచిపోయే ప్రమాదం ఉండటంతో కాంట్రాక్టర్లు కూడా అందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఒక్క విశాఖ జిల్లాలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్లు, ఇంకా ప్రారంభం కావాల్సిన ఇళ్ల నుంచి సదరు అధికారి ఏకంగా రూ.5 కోట్లకుపైగా వసూలు చేసేందుకు సిద్ధపడటం గమనార్హం. మరోవైపు నామినేటెడ్ పోస్టులోని కూటమి నేత ఒకరు కూడా వసూళ్ల దుకాణం తెరిచినట్టు తెలుస్తోంది. నేరుగా కాంట్రాక్టర్లతో డీలింగ్ చేసుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు తెలియకుండా ఏ ఒక్కరి బిల్లు కూడా జారీ కాకూడదంటూ హుకుం జారీ చేసినట్టు సమాచారం. ఒకవైపు అధికారులు, మరో వైపు కూటమి నేత వసూళ్లతో పేదల ఇళ్ల నిర్మాణం నాసిరకంగా మారనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మీరు ఎలా ఇళ్లు నిర్మించి ఇచ్చినా.. ఎటువంటి విచారణ లేకుండా బిల్లులు మంజూరు చేస్తామంటూ హామీ లభిస్తుండటంతో కాంట్రాక్టర్లు కూడా అడిగిన మొత్తం ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

కమీషన్లు రూ. కోట్లలోనే..

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 2 లక్షలకు పైగా ఇళ్లను గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. విశాఖ నగర పరిధిలో ఇళ్లు మంజూరు చేసినప్పటికీ.. టీడీపీ నేతలు కేసులు వేసి స్థలాలు ఇవ్వకుండా తాత్సారం చేశారు. చివరకు కోర్టులో కేసులు తేలిన తర్వాత జగనన్న కాలనీల్లో 2023 చివర్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఫలితంగా విశాఖ పరిధిలో నిర్మాణం పూర్తయిన ఇళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇంకా నిర్మాణంలో ఉన్నవి, ప్రారంభించాల్సిన ఇళ్ల సంఖ్య లక్షకు పైగానే ఉంది. ఇదే ఇప్పుడు అధికారులకు కలిసొచ్చింది. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలన్న కేంద్రం ఆదేశాలతో కాంట్రాక్టర్లు పరుగు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధికారులు కూడా వసూళ్లకు తెగబడినట్టు తెలుస్తోంది. ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున ఇవ్వాలంటూ గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారి ఒకరు టార్గెట్ విధించారు. ఇది చిన్న మొత్తంగా కనిపిస్తున్నప్పటికీ.. మొత్తం లెక్కిస్తే మాత్రం కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఒక్క విశాఖ జిల్లాలోనే నిర్మాణంలో ఉన్నవి, ప్రారంభం కావాల్సిన ఇళ్ల సంఖ్య 1,06,303 ఉన్నాయి. అంటే ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున లెక్కిస్తే సదరు అధికారి వసూళ్ల లక్ష్యం రూ.5.31 కోట్లకు పైమాటే. అనకాపల్లి, అల్లూరి జిల్లాలను కూడా కలిపి లెక్కిస్తే గృహ నిర్మాణ శాఖ అధికారుల వసూళ్ల మొత్తం సుమారు రూ.10 కోట్లకు చేరుతుంది. అంతేకాకుండా కింది స్థాయిలోని అధికారులతో పాటు నామినేటెడ్ పోస్టులోని మరో కూటమి నేత కూడా ఇంటికి ఇంత చొప్పున వసూళ్లకు తెగబడినట్టు సమాచారం. మొత్తం కలుపుకుంటే ఈ మొత్తం రూ.15 కోట్లకు చేరుకుంటుందని అంచనా.



మునగపాకలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ

ఇళ్ల నాణ్యతపై నీలినీడలు?

కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలపై కినుక వహించింది. గృహ నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయంటూ నానా యాగీ చేసింది. దీనిపై విచారణ చేపట్టాలంటూ హడావుడి చేసింది. గృహ నిర్మాణ లబ్ధిదారులందరూ అసలైన అర్హులు కావడంతో కిమ్మనకుండా ఉండిపోయింది. విచారణ పేరుతో పుణ్యకాలం కాస్తా గడిపింది. అయితే గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకపోతే రాయితీ మొత్తాన్ని ఇవ్వమని కేంద్రం నుంచి గట్టిగా వార్నింగ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలంటూ ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇదే అదనుగా కట్టే ప్రతీ ఇంటికీ తమ వాటాగా రూ.500 ఇవ్వాలంటూ జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి కాంట్రాక్టర్లను డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు నామినేటెడ్ పోస్టులోని కూటమి నేతతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా తమ వంతు వాటా ఇవ్వాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నారు. వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలన్న ఆదేశాలు ఒకవైపు.. వసూళ్ల డిమాండ్ మరోవైపు ఉండటంతో పేదల ఇళ్ల నిర్మాణాల నాణ్యతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.

పేదల ఇళ్ల నిర్మాణాలు

విశాఖ జిల్లాలో...	
మంజూరైన ఇళ్లు	1,14,795
పూర్తయిన ఇళ్లు	8,492
నిర్మాణ పనులు మొదలైన ఇళ్లు	91,219
ప్రారంభం కావల్సినవి	15,084
అనకాపల్లి జిల్లాలో..	
మంజూరైన ఇళ్లు	65,800
పూర్తయిన ఇళ్లు	28,910
వివిధ దశల్లో నిర్మాణంలోని ఇళ్లు	19,278
ప్రారంభం కావల్సినవి	17,627
అల్లూరి జిల్లాలో..	
మంజూరైన ఇళ్లు	56,852
పూర్తయిన ఇళ్లు	3,350
వివిధ దశల్లో నిర్మాణంలోనివి	49,798
ప్రారంభం కావాల్సినవి	3,527

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కా ఏర్పాట్లు



మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఏఆర్వోలను ఆదేశించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఎన్నిక నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ అందజేత, స్వీకరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలపాలని, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఆర్వోలు, పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులను రిటర్నింగ్ అధికారికి వివరించారు. విశాఖ జిల్లా ఏఆర్వో బి హెచ్.భవానీ శంకర్, అల్లూరి జిల్లా ఏఆర్వో పద్మలత, అనకాపల్లి జిల్లా ఏఆర్వో పీవీఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, విజయనగరం జిల్లా ఏఆర్వో శ్రీనివాసమూర్తి, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ఏఆర్వోలు పాల్గొన్నారు.

'సాల్ట్' రద్దుతోనే విద్యా రంగానికి రక్షణ

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్ కుమార్



మాట్లాడుతున్న కిశోర్ కుమార్

విశాఖ విద్య: రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగాన్ని సాల్ట్ పథకం విచ్ఛిన్న దశకు తీసుకెళుతోందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన యూటీఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాల్ట్ పథకం వల్ల ఒకటి, రెండు తరగతుల మారినటువంటి పాఠశాలల సంఖ్య 12 వేలకు పెగా ఉన్నాయని, అక్కడ చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం కష్టంగా ఉందన్నారు. జీవో నంబర్ 117 రద్దు చేసి నూతన జీవో కోసం చేస్తున్న కసరత్తుతో ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మూసివేత గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం సాల్ట్ పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహన్ రావు మాట్లాడుతూ సాల్ట్ పథకం వల్ల ప్రాథమిక పాఠశాలలు బలహీనపడితే భవిష్యత్‌లో ఉన్నత పాఠశాలలు కూడా బలహీనపడతాయన్నారు. ఈ పథకం వల్ల రోజు వారి గణాంకాలు సేకరించాల్సి ఉందని, దీని వల్ల బోధనకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. ఉపాధ్యాయులకు బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్, కోశాధికారి రాంబాబు, సహాధ్యక్షుడు ఎస్.ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

ముగ్గురు డిశ్చార్జ్.. ముగ్గురు చేరిక

మహారాణిపేట (విశాఖ): గులియన్ బారే సిండ్రోమ్‌తో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో గురువారం ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారు. ఇదే వ్యాధి లక్షణాలతో మరో ముగ్గురు కేజీహెచ్‌లో చేరారు. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య ఏడుకు చేరింది. ఈ వ్యాధి లక్షణాలు కలిగిన ఒక మహిళ సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. మొత్తం ఏడుగురు కేజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగంలో చికిత్స పొందుతున్నారు.

బల్క్‌డ్రగ్ పార్క్ కోసం మరో వెయ్యి ఎకరాలు భూసేకరణ





అమలాపురం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి : బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం నక్కపల్లి మండలంలో మరో వెయ్యి ఎకరాలు భూసేకరణ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడించారు. గురువారం ఆమె మండలంలో కాగిత, అమలాపురం, పాటిమీద, మూలపర, రాజయ్యపేట: గామాల్లో ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో సుడిగాలి పర్యటన చేశారు. బల్క్ డ్రగ్ పార్క్, ఆర్సిలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం కేటాయించిన భూములు పరిశీలించారు.

నిలిచిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులపై ఆరా..

పరిశ్రమల కోసం అమలాపురం శివారు పాటిమీద సమీపంలో ఏర్పాటు చేయబోయే 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులను కలెక్టర్ పరిశీలించారు. గతంలో ఇక్కడ ఏపీఐఐసీ వారు విద్యుత్ సబ్‌స్టేసన్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించగా, రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించకపోవడం వల్ల రైతులు పనులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి ఎంపిక చేసిన భూములను పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులను నిర్మాణ పనులపై ఆరా తీశారు. వేంపాడు సమీపం వరకు హెచ్‌టీ లైన్ ఏర్పాటు పూర్తయిందని, అక్కడ నుంచి కిలోమీటరున్నర దూరం సర్వే చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. అలాగే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసే భూముల్లో నష్టపరిహారం చెల్లింపునకు సంబంధించి సమస్యలు ఉన్నాయని వివరించారు. విద్యుత్ లైను ఏర్పాటు చేయకుండా, సర్వే చేయకుండా, రూట్ ఆఫ్ వే‌కు అనుమతి ఇవ్వకుండా ఇక్కడ సబ్‌స్టేషన్ ఎలా ఏర్పాటు చేస్తారని ఏపీఐఐసీ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. రైతులతో సమస్యలు ఏమైనా ఉంటే ఆర్‌డీవో రమణ పరిష్కరిస్తారని సూచించారు. ముందు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

100 ఎకరాల విస్తీర్ణంలో రోడ్లు, బ్రిడ్జిలు, డ్రెయినేజీల నిర్మాణం

అనంతరం ఆమె రాజయ్యపేట సమీపంలో ఏపీఐఐసీ వారు బల్క్ డ్రగ్ పార్క్ కోసం చేపడుతున్న మౌలిక సదుపాయాల పనులు (రోడ్లు, డ్రెయినేజీలు)ను పరిశీలించారు. కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్న ఆర్‌ఎస్‌ఎస్‌ఆర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. బల్క్‌డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన జరిగిన కొద్దిరోజుల్లోనే మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా జరగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిపాదిత బల్క్ డ్రగ్ పార్క్ ఏరియాలో సుమారు 100 ఎకరాల్లో (దాదాపు 4 లక్షల చదరపు మీటర్ల)విస్తీర్ణంలో రోడ్లు, డ్రెయినేజీలు, బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. రైతులకు నష్ట పరిహారం, తదితర సమస్యలను స్వయంగా పర్యవేక్షించాలని ఆర్‌డీవో రమణకు సూచించారు. అనంతరంకలెక్టర్ విజయకృష్ణన్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన జరిగిన తర్వాత తొలిసారిగా ఏపీఐఐసీ భూములు పరిశీలించడానికి రావడం జరిగిందన్నారు. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో సుమారు 2600 ఎకరాలు ఆర్సిలర్ మిట్టల్, నిప్పన్ ఇండియా లిమిటెడ్ వారు ఏర్పాటు చేయబోయే స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించడం జరిగిందన్నారు.

రాజయ్యపేట, అమలాపురం, వేంపాడు, డీఎల్‌పురం తదితర ప్రాంతాల్లో ఈ భూముల కేటాయింపు జరిగిందన్నారు. చందనాడ, బుచ్చిరాజుపేట, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్ పార్క్ కోసం మరో వెయ్యి ఎకరాలు భూసేకరణ చేస్తున్నామన్నారు. పెదతీనార్ల, బోయపాడు, దొండవాక సమీపంలో ఈ భూములను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు.ఈ భూములను కూడా ఆమె పరిశీలించారు. ఈ వెయ్యి ఎకరాల భూసేకరణకు సంబంధించి నోటిఫికేషన్ త్వరలో విడుదల చేయడం జరుగుతుందన్నారు.

డీ ఫారం భూముల్లో చెట్లకు నష్టపరిహారం చెల్లించాలి..

కాగా ఏపీఐఐసీ వారు సేకరించిన డీఫారం, ప్రభుత్వ సాగు భూముల్లో రైతులకు చెందిన జీడి, మామిడి, కొబ్బరి చెట్లకు నష్టపరిహారం చెల్లించలేదని, వీరికి కూడా నష్టపరిహారం చెల్లించాలని అఖిల పక్ష రైతు నాయకులు వీసం రామకృష్ణ, ఎం.అప్పలరాజు, గింజాల రమణ తదితరులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జిరాయితీ రైతులకు ఇచ్చి, డీఫారం రైతులకు పరిహారం చెల్లించలేదని, వారికి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

కలెక్టర్ వెంట ఆర్‌డీవో వి.వి.రమణ, తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి, ఆర్ఐ కన్నబాబు, ఏపీఐఐసీ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు, సీఐ కుమారస్వామి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబు, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం లేకుండా పునరావాసం ఎలా? - 8లో

క్లుప్తంగా

అనకాపల్లిలో ప్రెస్ భవనం ఏర్పాటుకు కృషి

అనకాపల్లి: జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత అనకాపల్లి పట్టణంలో జర్నలిస్టులకు ప్రెస్ భవనాన్ని కొత్తగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ ఫంక్షన్ హాల్లో విలేకరులతో ఆయన సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలో జర్నలిస్టులకు ప్రభుత్వ స్థలం కేటాయించి, గృహాలు నిర్మించుకునే విధంగా చర్యలు చేపడతామన్నారు. అక్రిడిటేషన్ జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వటం లేదని తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయంపై జిల్లాలో అన్ని ప్రైవేట్ యాజమాన్యాలకు డీఈవో ద్వారా నోటీసులు జారీ చేస్తామన్నారు. అర్హత కలిగిన వారికి అక్రిడిటేషన్లు మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

పీసా చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్డీ డీడీ రామనాథం

చింతపల్లి: పీసా చట్టంపై గిరిజనులు అవగాహన పెంచుకోవాలని ఏపీఎస్ఐఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం అన్నారు. పీసా కమిటీ సభ్యులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన గురువారం చింతపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీసా చట్టం, దాని అమలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతపల్లిలో చిరుజల్లులు



చింతపల్లిలో కురుస్తున్న వర్షం

చింతపల్లి: మండల కేంద్రంలో గురువారం చిరుజల్లులు కురవడంతో ఉపశమనం కలిగింది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం తెల్లవారుజామున చలి మంచుతో ఇబ్బందులు పడుతుండగా 9 గంటలు దాటాక ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ జల్లులు గంటకు పైగా కురిశాయి.

ఉపమాకలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

- పరిశీలించిన టీటీడీ ఇంజినీరింగ్ బృందం



ఉపమాకలో పర్యటిస్తున్న టీటీడీ ఎస్ఈ జగదీశ్వరరెడ్డి బృందం

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ వారు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు ఉపమాకలో పర్యటించారు. గురువారం ఎస్ఈ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ ఇంజనీరింగ్ విభాగం వారు ఇక్కడ పుష్కరిణి, మెట్లమార్గం, పార్కింగ్ ప్రాంతం, ఆలయ ప్రాంగణం, గరుడాద్రి పర్వతంపై మూలవిరాట్ సన్నిధి, తదితర ప్రాంతాలను సందర్శించారు. వచ్చే నెల 10వ తేదీ నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతోపాటు, గతంలో ఆలయాన్ని దత్తత తీసుకున్న సందర్భంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ఇటీవల హోం మంత్రి అనిత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ మేరకు పుష్కరిణిని బాగు చేయడం, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, మెట్ల మార్గాన్ని ఆధునికీకరించడం, కల్యాణ మండపం ఏర్పాటు, కాటేజీలు, డార్మెటరీలు, మరుగుదొడ్ల నిర్మాణం, భక్తులకు, దేవస్థానం వారికి తాగునీటి సదుపాయం కోసం 30 వేల కిలో లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు, కొండపైకి ఘాట్‌రోడ్డు, కొండ దిగువన క్షౌ రశాల నిర్మాణం, ఉపమాక నుంచి నక్కపల్లి వరకు మెయిన్ రోడ్డు విస్తరణ వంటి పనులు చేపట్టాల్సి ఉందని టీటీడీ ఎస్ఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. కొండపై తిరుమల, సింహాచలం, అన్నవరం పుణ్యక్షేత్రాల్లో మాదిరిగా లైటింగ్‌తో కూడిన గోవింద నామాలు ఏర్పాటుకు పరిశీలించడం జరిగిందన్నారు. కల్యాణోత్సవాల సందర్భంగా భారీ విద్యుద్దీకరణ పనులు చేపట్టాలని మంత్రి కోరారన్నారు.

ప్రధాన రాజగోపురం ఎదురుగా కల్యాణోత్సవాలకు వచ్చే భక్తుల కోసం జర్మన్ టెంట్లు ఏర్పాటుకు పరిశీలిస్తున్నామన్నారు. ఈ పనులన్నింటికి ప్రతిపాదనలు తయారు చేసి పాలకమండలి ఆమోదానికి పంపిస్తామన్నారు. టీటీడీ ఈఈ సురేంద్రనాథ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ సాధించిన విద్యార్థులు

పాయకరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్ 28న నిర్వహించిన 32వ సీవీ రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల చిన్నారులు ప్రతిభ కనబరిచారు. జనరల్ నాలెడ్జ్, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం విభాగాలలో నిర్వహించిన ఈ పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాలలో విద్యార్థినులు ఎం.హంసిని(9వ తరగతి), ఎం.విశ్రుత్(5వ తరగతి) నిలిచి యంగ్ జీనియస్ అవార్డులను సాధించారు. జిల్లా స్థాయిలో ఆర్.సాత్విక్ చంద్ర 3వ తరగతి, కె.ప్రహసిత 4వ తరగతి, డి.విఖ్యాత్ 5వ తరగతి, ఇ.నవీన్ హర్ష 6వ తరగతి, కె.సిద్ధార్థ వర్మ 7వ తరగతి, పి.గౌతమ్ కృష్ణ 8వ తరగతి ప్రథమ స్థానం సాధించారు. వై.రిషి దుర్గ 4వ తరగతి, పి.శ్రీవత్స 5వ తరగతి, ఎ.భువన శ్రీనివాస్ కామేష్ 7వ తరగతి ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి హైదరాబాద్ లలిత కళాతోరణంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

'కొత్తపల్లి' అందాలకు ఫిదా

- జలపాతాన్ని సందర్శించిన పీఎం జన్‌మన్ కేంద్ర కమిటీ

జి.మాడుగుల: పీఎం జన్‌మన్ కేంద్ర కమిటీ బృందం గురువారం కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించింది. చింతపల్లి మండలంలో పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాల పరిశీలన నిమిత్తం వెళుతూ మధ్యలో గృహనిర్మాణ శాఖ అధికారులతో కలిసి కేంద్ర గ్రామీణాభివృద్ధి గృహ నిర్మాణ విభాగం పీఎంయూ ఆర్‌హెచ్ సభ్యురాలు నిషి కాండెల్‌వల్ తదితరలు జలపాతాన్ని తిలకించారు. అక్కడి ప్రకృతి అందాలకు ముగ్ధులయ్యారు.

ఇక్కడ పెద్దపెద్ద బండరాళ్లపై నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహాన్ని కెమెరాలో బంధించారు. హౌసింగ్ పీడీ బాబూనాయక్, జి.మాడుగుల హౌసింగ్ ఏఈ డి.ఈశ్వరరావు తదితరులు వారి వెంట ఉన్నారు.

టైర్ల పరిశ్రమలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రేపు

అచ్యుతాపురం రూరల్ : స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో యోకోహమా ఆఫ్ హైవే టైర్స్ పరిశ్రమ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల కరస్పాండెంట్ ధర్మిరెడ్డి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న నిర్వహించే ఇంటర్వ్యూలకు ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ చేసిన మహిళా అభ్యర్థినులు అర్హులన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థినుల వయస్సు 18 నుంచి 25 సంవత్సరాలు కలిగి ఉండి, కనీస ఎత్తు 5.3 అడుగులు, బరువు 50 కేజీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 97012 41753 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.

మతిస్థిమితంలేని బాలిక ఆత్మహత్య



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సుధాకర్, (ఇన్‌సెట్) మృతురాలు సస్మిత గహన (ఫైల్)

అచ్యుతాపురం రూరల్ : మతిస్థిమితంలేని ఒడిశా రాష్ట్రానికి చెందిన సస్మిత గహన (16) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన అచ్యుతాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు సస్మిత గహన తన వరసకు అక్క అయిన మానస ఇంట్లో ఉంటుంది. మానస దినసరి కూలీగా పని చేసుకుని ఇంటికి తిరిగి వచ్చే సరికి మృతురాలు ఇంటి గదిలో తలుపు గడియ పెట్టి ఉండడం గమనించి తలుపుతీయమని పలుమార్లు గట్టిగా తలుపు కొట్టింది. అయితే తలుపు తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపు బద్దల గొట్టి చూడగా గహన ఫ్యాన్‌కి ఉరి వేసుకుని మృతి చెంది ఉంది. ఇది గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధాకర్ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించి క్లూస్ టీంకి తెలియజేశారు. మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

మునగపాక : మండలంలోని గణపర్తికి చెందిన పొలిమేర దీపికపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. పొలిమేర దీపిక మునగపాకలో బీసీ కాలనీలో అద్దెకు ఉంటుంది. అదే ఇంటి పక్కన అచ్యుతాపురంలోని ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్న నమాడి శాంతరాజ్, సరిత ఇరువురు కూడా అద్దెకు ఉంటున్నారు. సరిత వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు ఈ విషయం దీపికకు తెలిసిందని, తన భర్తకు ఈ విషయం చెపుతుందని భావించిన సరిత ఈ నెల 18న రాత్రి 11 గంటల సమయంలో దీపిక వద్దకు వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అనంతరం కేసు విచారణలో భాగంగా గురువారం దీపికపై దాడి చేసిన శాంతరాజ్, సరితలను అరెస్టు చేసి విశాఖ సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందని ప్రసాదరావు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 31 మందికి జైలు, జరిమానాలు

యలమంచిలి రూరల్ : యలమంచిలి పట్టణ, ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నమోదు చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 31 మందిని గురువారం కోర్టులో హాజరు పరిచారు. ట్రాఫిక్ పోలీసులు 22 మందిపై కేసులు నమోదు చేయగా 11 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.1.10 లక్షలు జరిమానా విధించగా, మిగిలిన 11 మందికి ఒక్కొక్కరికి నాలుగు రోజులు చొప్పున జైలుశిక్ష విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు. పట్టణ పోలీసులు 9 మందిపై కేసులు నమోదు చేయగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.50 వేల జరిమానా, మరో నలుగురికి ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జైలుశిక్ష విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

యలమంచిలి రూరల్ : పట్టణంలోని పెదపల్లి హైవే కూడలి వద్ద తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గాంధీనగరానికి చెందిన సత్యనారాయణ(64) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు యలమంచిలి పట్టణ ఎస్ఐ కె. సావిత్రి తెలిపారు. మృతుడికి స్థానిక గ్రీన్‌సిటీ లేఅవుట్ వద్ద వ్యవసాయ క్షేత్రం ఉంది. యలమంచిలి నుంచి తుని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో సత్యనారాయణ తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని ఎస్ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

నిండు గర్భిణికి తప్పని డోలీ తిప్పలు

- జాజులబంద నుంచి అర్ల వరకు అష్టకష్టాలు



శాంతిని డోలీపై తరలిస్తున్న బంధువులు

కొయ్యూరు: కూటమి ప్రభుత్వం హామీలు నీటి మీద రాతలుగా మారాయి. ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలలోపే డోలీ మోతలను నివారిస్తామని చేసిన హామీ నేటికీ నెరవేరలేదు. తాజాగా గురువారం మూలపేట పంచాయతీ జాజులబందకు చెందిన ఆదివాసీ మహిళ కొర్రా శాంతికి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. రహదారి అర్ధంతరంగా ఆగిపోవడంతో జాజులబంద నుంచి నుంచి రోలుగుంట మండలం అర్ల వరకు నాలుగు కిలోమీటర్ల దూరం డోలిపై తరలించారు. అక్కడ నుంచి డౌనూరు ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం శాంతిని మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. 2023లో రూ.కోటి 28 లక్షలతో ఉపాధి రోడ్డును మంజూరు చేశారు. కల్వర్టులు నిర్మించాక పనులు ఆపారు. రోడ్డు నేటికీ అసంపూర్తిగా ఉండడంతో వాహనాలు రావడం లేదు. 160 మంది జనాభా ఉన్న గ్రామానికి ఎలాంటి అత్యవసరమైనా డోలీ మోతలు తప్పడం లేదు. తక్షణమే రోడ్డును పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైక్ స్టార్ట్ చేస్తుండగా పేలుడు

- వ్యక్తికి స్వల్పగాయాలు



పేలుడు సంఘటనలో దగ్ధమైన బైక్

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్దాది గ్రామంలో గురువారం పేలుడు సంఘటన కలకలం రేపింది. గ్రామంలో కుబిరెడ్డి ఈశ్వరరావు తన ఇంటి వద్ద బైక్‌ను స్టార్ట్ చేస్తుండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో అతడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చోడవరంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించింది. ఎస్ఐ మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు.

తాగునీటి సదుపాయం లేకుండా పునరావాసం ఎలా?

నక్కపల్లి : విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా భూములు, నివాస ప్రాంతాలు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు ఎంపిక చేసిన ప్రాంతాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం పరిశీలించారు. పాటిమీద, మూలపర, బుచ్చిరాజుపేట, బోయపాడు, రాజయ్యపేట గ్రామాలకు చెందిన సుమారు 795 మంది రైతులు భూసేకరణ వల్ల ఇళ్లు, నివాస ప్రాంతాలను కోల్పోవలసిన పరిస్థితి ఉంది. వీరికి పెదబోదిగల్లం రైల్వేట్రాక్‌కు సమీపంలో ఉన్న సుమారు 170 ఎకరాలను ఎంపిక చేసి అక్కడ పునరావాసం కల్పించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే రైతులతో చర్చించి ఎకరాకు రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుని డైరెక్ట్ పర్చేజింగ్ విధానంలో ఏపీఐఐసీ వారు భూములు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 25 ఎకరాలు కొనుగోలు చేశారు. పునరావాసం కోసం ఎంపిక చేసిన భూములను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఇక్కడ సుమారు 800 మందికి సరిపడా లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తారని, వీరందరికీ తాగునీటిని ఎక్కడ నుంచి సరఫరా చేస్తారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉద్దండపురం వాటర్ ప్రాజెక్టు నుంచి పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని అధికారులు వెల్లడించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ ప్రాజెక్టు అది కూడా 15 కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తీసుకు రావడం సాధ్యమయ్యే పనేనా? అని నిలదీశారు. నీటి సదుపాయం లేకుండా ఇక్కడ 800 మందికి పునరావాసం ఎలా కల్పిద్దామనుకుంటున్నారని అన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా నీటి సదుపాయం కల్పించకుండా నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి వీల్లేదన్నారు. ముందుగా తాగునీటి మార్గాలపై అన్వేషణ చేయాలన్నారు. ఆ తర్వాతే లేఅవుట్లు వేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట నర్సీపట్నం ఆర్డీవో రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఆర్ఐ కన్నబాబు, సర్వేయర్లు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు లాభదాయకం



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకర్

నర్సీపట్నం: ఉద్యాన పంటలు రైతులకు లాభసాటిగా ఉంటుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ పరిధి వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలతో అధిక దిగుబడులు సాధించేవచ్చననే విషయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సంప్రదాయ పంటల కంటే రెండు రెట్లు ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. పండించిన పంటలు అమ్ముకునేందుకు విశాఖ, తునిలో మార్కెట్ సదుపాయం ఉందన్నారు. పండ్లు, కూరగాయలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. బిందు సేద్యానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా గ్రామీణ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ శిరీష పాల్గొన్నారు.

చిట్టీలు, వడ్డీల వ్యాపారి మృతి

- లబోదిబోమంటున్న బాధితులు
- రాత్రయినా ఇంటి వద్దే నిరీక్షణ
- రూ.కోట్లలో నగదు నష్టపోయినట్టు అంచనా



మృతుడు వెంకటరామారెడ్డి (ఫైల్)

మాకవరపాలెం: చీటీల వ్యాపారి మృతి మండలంలో కలకలం రేపింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కాకినాడ జిల్లా ప్రాంతానికి చెందిన గొలుగూరి వెంకటరామారెడ్డి సుమారు 35 ఏళ్ల క్రితం మాకవరపాలెం వచ్చి స్థిరపడ్డాడు. అప్పటి నుంచి డైలీ ఫైనాన్స్‌తోపాటు చీటీల వ్యాపారం కొనసాగిస్తున్నాడు. బాగా నమ్మకం ఏర్పరుచుకున్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 300 మందికిపైగా చీటీలు కట్టడంతోపాటు వడ్డీలకు రూ.లక్షల్లో నగదును రామారెడ్డికి ఇస్తూ లావాదేవీలు చేస్తున్నారు. అయితే గురువారం ఉదయం ఉన్నట్టుండి విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న వందలాది మంది అతడి ఇంటికి చేరుకుని లబోదిబోమంటున్నారు. సుమారు రూ. 40 కోట్ల వరకు వడ్డీల రూపంలోను, చీటీల రూపంలో ఇచ్చినట్టు వారంతా అంచనా వేస్తున్నారు.

వడ్డీల నగుదుతోనే చీటీలు...

రామారెడ్డి వద్ద చీటీలు కట్టే వారంతా ముందుగా నగదును వడ్డీకి ఇస్తారు. అతడు ఇచ్చిన వడ్డీతో చీటీలు కట్టుకుంటూ వస్తున్నారు. పేద, మధ్య తరగతి వారంతా తినోతినకో సంపాదించిన మొత్తంలో కొంత దాచుకుని వడ్డీకి ఇచ్చారు. చీటీ అయిపోయిన అనంతరం కూడా ఆ నగదును మరలా అతడి వద్దే వడ్డీకి ఉంచి మరో చీటీ కట్టేవారు. ఇంతలో రామారెడ్డి అకాల వార్త నగదు ఇచ్చిన వారితోపాటు, చీటీలు కట్టేవారిలో ఆందోళన రేపింది. అయితే గత నాలుగు నెలలకు పైగా చీటీలు పాడుకున్న వారికి సక్రమంగా నగదు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కూతుళ్ల పెళ్లిళ్ల కోసం రామారెడ్డి వద్ద దాచుకున్న నగదు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు పడ్డామని మరికొందరు చెబుతున్నారు. ఈ లావాదేవీలన్నీ చీటీల పుస్తకంపైనే జరగడం విశేషం. మాకవరపాలెం, కొండలఅగ్రహారం, కొత్తపాలెం, జీ కోడూరు, బయ్యవరం, తదితర గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో బాధితులు రాత్రయినా వెళ్లకుండా మృతుడి ఇంటి వద్దే వేచిఉన్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్త వహించండి



డ్రైవర్లతో కలిసి సంకల్ప పోస్టర్లను ఆవిష్కరిస్తున్న క్రైమ్ అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు, సీఐ గోవిందరావు

- క్రైమ్ జిల్లా అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు

నర్సీపట్నం: రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు సూచించారు. గురువారం నర్సీపట్నం విచ్చేసిన ఆయన పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చో పెట్టకూడదన్నారు. ఓవర్ లోడింగ్, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. నిషేధిత ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్ చేయటం నేరమన్నారు. వాహనం నడుపుతూ ఫోన్లో మాట్లాడకూడదన్నారు. ఈ జాగ్రత్తలు పాటించటం ద్వారా ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. ప్రయాణికుల ప్రాణాలు మీ గుప్పెట్లో ఉన్నాయన్న విషయాన్ని మరిచిపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం సంకల్ప పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ గోవిందరావు, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

జీడితోటలో అక్రమంగా చెట్ల నరికివేత

- కూటమి నేతల అండతో వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన తోట ఆక్రమణకు యత్నం
- అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



సంఘటన స్థలంలో మాట్లాడుతున్న బాధితుడు వైఎస్సార్‌సీపీ నేత ఇట్టంశెట్టి మహలక్ష్మి

నాతవరం : మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత 44 ఏళ్లుగా పెంచుకుంటున్న జీడి తోటను తప్పుడు ఆన్‌లైన్ రికార్డు అడ్డం పెట్టుకుని కూటమి నేతల అండతో అధికారపార్టీకి చెందిన వ్యక్తి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించాడు. అక్రమంగా తోటలోకి ప్రవేశించి కటింగ్ మెషీన్‌తో జీడిచెట్లను నరికేశారు. పంట చేతికందే సమయంలో జీడి పిక్కలతో ఉన్న చెట్లు నరికివేయడంతో బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. దీనికి సంబంధించి బాధితుడు, వైఎస్సార్‌సీపీ నేత ఇట్టంశెట్టి మహాలక్ష్మి చెప్పిన వివరాలివి. నాతవరం మండలం ఎం.బెన్నవరం పంచాయతీలో సర్వే నంబరు 68/2లో 2 ఎకరాల జిరాయితీ భూమి ఉంది. ఈ భూమిని 1981లో డి.యర్రవరం గ్రామానికి చెందిన చిక్కాల వారి నుంచి 2 ఎకరాల మెట్ట భూమి కొనుగోలు చేశారు. ఆ భూమిలో జీడి మామిడి మొక్కలు వేయడంతో ప్రస్తుతం అవి భారీ చెట్లు పెరిగి కొన్నేళ్లుగా ఫలసాయం పొందుతున్నాడు. గత ఏడాది జగనన్న భూ రీసర్వే సమయంలో ఈ పంచాయతీలో రెవెన్యూ అధికారులు రీసర్వే చేశారు. రీసర్వే చేసి కొత్తగా రికార్డులు తయారు చేసే సమయంలో ఈ భూమికి సరిహద్దు కొండ గెడ్డ అవతల వైపు ఉన్న ఇదే గ్రామానికి చెందిన రైతు పేరు మీద ఒక ఎకరం ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేసేశారు. తప్పుడుగా ఆన్‌లైన్‌లో నమోదైన రైతు అధికార పార్టీకి చెందిన వ్యక్తి. ఈ వ్యక్తికి కూటమి నేతలు అండదండలు పుష్కలంగా ఉన్నాయి. గత ఏడాది తన భూమి తప్పుగా వేరే రైతు పేరు మీద ఆన్‌లైన్‌లో నమోదైనట్టు భూ యజమాని మహాలక్ష్మి చూసుకోలేదు. ఈ నేపథ్యంలో అధికారపార్టీ నేతల అండతో ఈనెల 4వ తేదీన ఆన్‌లైన్‌లో తన పేరు మీద తప్పుగా నమోదైన రికార్డును అడ్డంపెట్టుకుని సదరు వ్యక్తి ఆ భూమిని ఆక్రమించుకోవాలని కన్నేశాడు. తోటలోని జీడి చెట్లను అక్రమంగా మిషన్‌తో కటింగ్ చేశాడు. దీనిపై బాధితుడు మహాలక్ష్మి తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, ఎస్ఐ భీమరాజుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి 10 రోజులు గడుస్తున్నా తహసీల్దార్ గానీ, ఎస్ఐ గానీ పట్టించుకోకపోవడంతో బాధితుడు జిల్లా ఎస్పీ ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఈనెల 15వ తేదీన ఇరువురిని నాతవరం మండల కార్యాలయానికి పిలిచి రికార్డులు పరిశీలించారన్నారు. 19వ తేదీన సంఘటన స్థలానికి వచ్చి నరికేసిన జీడి చెట్లు చూస్తానని చెప్పారని, కానీ తహసీల్దార్ చెప్పిన ప్రకారం 19వ తేదీన తోటలోకి రాలేదన్నారు. అదే రోజు సాయంత్రం మళ్లీ తన తోటలో 25పైగా జీడి చెట్లు నరికేశారన్నారు. ఇరువురి భూమికి సరిహద్దుగా ఉన్న కొండ గెడ్డను సైతం పొక్లెయిన్‌తో కప్పేశారని అన్నారు. చెట్ల నరికివేతపై తిరిగి గురువారం ఉదయం తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ భీమరాజుకు ఫిర్యాదు చేశానని బాధితుడు మహాలక్ష్మి విలేకరులకు తెలిపారు.



సంఘటన స్థలంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్, పక్కన ఎస్ఐ భీమరాజు

నరికేసిన జీడి చెట్లు పరిశీలించిన తహసీల్దార్, ఎస్ఐ

నాతవరం : ప్రభుత్వ నిబంధనల ప్రకారం గెడ్డలను ఆక్రమించుకోవడం చట్ట రిత్యా నేరమని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండలంలో ఎం.బెన్నవరం పంచాయతీలో జీడిచెట్లు అక్రమంగా నరికివేసిన ప్రదేశాన్ని గురువారం సాయంత్రం ఎస్ఐ సిహెచ్.భీమరాజుతో కలిసి పరిశీలించారు. సంఘటన స్థలంలో నరికేసిన జీడి చెట్లను స్వయంగా పరిశీలించి ఇరువురితో మాట్లాడారు. మీ భూములకు సంబంధించి రికార్డులను చూపించాలని అడిగారు. మీకున్న హక్కులు ప్రకారం భూములను సర్వే చేస్తానని ఇరువురు వివాదం పడరాదని చెప్పానని తహసీల్దార్ విలేకరులకు తెలిపారు. గెడ్డలో చెట్లు ఎవరూ వేయరాదన్నారు. అన్యాయంగా నరికేసిన జీడి చెట్ల విషయంపై ఏం చర్యలు చేపడతారని అడగగా మాట దాటవేశారు.

క్లుప్తంగా

నూకాంబిక మాలధారణ ప్రారంభం



నూకాంబిక అమ్మవారి ఆలయంలో మాలధారణ చేస్తున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి మాలధారణ కార్యక్రమాన్ని గురువారం నూకాంబిక అమ్మవారి మాలధారణ సంఘం వ్యవస్థాపకుడు పాలిమేర శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 రోజుల అర్ధ మండల దీక్ష చేపట్టే భక్తులు వచ్చే నెల 9న మాలధారణ చేస్తారన్నారు. నవరాత్రుల దీక్ష చేపట్టే భక్తులు ఈ నెల 21న మాలధారణ చేపడతారని చెప్పారు. వచ్చేనెల 25న అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి మాలధారణ భక్తులు సూరిశెట్టి శ్రీను, బుద్ద రాజు, మళ్ల గణేష్, కోలపర్తి శ్రీను, బుద్ద చిన్ని సూరిశెట్టి హృదయ్ తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ నారాయణ సస్పెన్షన్ దారుణం



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అనకాపలి టౌన్: స్థానిక డిపోలో పని చేస్తున్న కండక్టర్ ఎస్ఎస్ నారాయణను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిపో ఎన్ఎంయూఏ అధ్యక్షుడు ఎ.ఎస్.రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. 1-19 సర్కులర్‌కు విరుద్ధంగా కండక్టర్‌ను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. తక్షణమే అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ కె.ఎన్.వి.రమేష్, గ్యారెజీ సెక్రటరీ ఎం.ఎస్.అప్పడు, కోశాధికారి ఎం.బంగార్రాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో టమాటా ఎప్పటిలాగే రూ.10, బంగాళాదుంప, వంకాయ రూ.20, ఉల్లిపాయ, చిక్కుడు రూ.40, బీట్రూట్, క్యారెట్, బెండకాయ, చేపదుంప, బీన్స్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 6,359 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,600	4,300
రెండో రకం	3,110	3,760
మూడోరకం	2,940	3,100

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ :రాజా
ఆరెంజ్ : సత్యనారాయణస్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2 : సత్యనారాయణస్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు)
జాబిలమ్మ నీకు అంత కోపమా : సత్యనారయణ స్క్రీన్-2
తండేల్ :పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం :షిర్డీసాయి
సూర్య కృష్ణన్ :వెంకటేశ్వర(ఉదయం)
తల :వెంకటేశ్వర(మ్యాట్నీ, 1, 2 షోలు)
సై :శ్రీసత్య
రామం రాఘవం :రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 259 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 194 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

అడుగడుగునా గుంతలు



ఏఎంఏఎల్ కళాశాల రైల్వే ఫ్లైఓవర్‌పై గోతులు



శిథిలావస్థకు చేరిన తుమ్మపాల రహదారి

- అధ్వాన రహదారులతో ప్రజల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

అనకాపల్లి: గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టిన మూడు మాసాల్లో రహదారుల అభివృద్ధి చేపడతామంటూ ఇచ్చిన హామీని గాలికి వదిలేసింది. కనీసం గోతులను సైతం పూడ్చకుండా తాత్సారం



బ్రిడ్జిపై దర్శనమిస్తున్న ఊచలు

చేస్తోంది. మండలంలో 32 పంచాయతీ పరిధిలో ఎక్కడ చూసిన శిథిల రహదారులు దర్శనమిస్తున్నాయి. పెద్దపెద్ద గోతులతో నిండిన రోడ్లపై రాకపోకలకు వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు గోతుల్లో పడిపోయి ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు నెలకొంటున్నాయి. రహదారుల మరమ్మతుల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. మండలం పరిధిలో రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం సుమారు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి పలు చోట్ల పనులు చేపట్టినప్పటికీ నాణ్యత లోపం కారణంగా అవి పాడైపోయాయి. సుమారు మూడు మాసాలు క్రితం చేపట్టిన ఫ్లైఓవర్ మరమ్మతు పనులు మధ్యలో నిలిపివేశారు. స్థానిక ప్రజలను, వాహనదారులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉంది. అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రహదారి పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం భయంగా వాహనచోదకులు ప్రయాణిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దశల వారీగా పనులు

గ్రామాల్లో రహదారుల మరమ్మతు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దశల వారీగా పనులు చేస్తున్నాం. ఏఎంఏఎల్ కళాశాలకు వెళ్లే రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పాడైన విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. రూ.2 కోట్ల నిధులు విడుదల చేసింది. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తాం.

– ప్రభు, ఆర్ అండ్ బీ ఏఈ, అనకాపల్లి

వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం



మందపాటి జానకీరామరాజు



పెదిశెట్టి గోవింద్



మలసాల కిషోర్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు నియోజకవర్గ వర్గంలోని పలువురికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ పార్టీ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడిగా మందపాటి జానకీరామ రాజు, అనకాపల్లి మండల అధ్యక్షుడిగా పెదిశెట్టి గోవింద్, కశింకోట మండల అధ్యక్షుడిగా మలసాల కిషోర్ వెంకట అప్పల త్రినాథ్ రావును నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ట్రాఫిక్ నిబంధనల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రైనీ డీఎస్పీ చైతన్య, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ ఈశ్వరరావు

అనకాపల్లి: ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రైనీ డీఎస్పీ ఎస్.వి.కె.చైతన్య అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో గురువారం ఆటో, వ్యాన్, కారు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ఆటోలో అనుమానిత వ్యక్తులు ప్రయాణిస్తే దగ్గరలో పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ మాట్లాడుతూ రహదారులపై ఆటోలను అడ్డదిడ్డంగా నిలిపి ప్రయాణికులను ఎక్కించడం, దించడం చేస్తే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో ప్రతి వ్యక్తి యూనిఫాం ధరించాలన్నారు. వాహన రికార్డులను పోలీస్, రవాణాశాఖ అధికారులు అడిగినప్పుడు తప్పనిసరిగా చూపించాలన్నారు. పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని కోరారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్ నంబర్, ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితిలోనూ చెప్పొద్దని సూచించారు. ప్రతి వ్యక్తి కష్టాన్నినమ్ముకుని జీవించాలని ఆయన సూచించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరిధిలో వివిధ ఆటో యూనియన్ సభ్యులు, కార్లు, వ్యాన్ డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి, కార్పొరేటర్ మందపాటి సునీత

తుమ్మపాల: పట్టణంలో విజయరామరాజుపేటలో కొలువుదీరిన మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్న లక్ష్మి, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సాంఘిక నాటకాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భాషాభివృద్ధిపై అవగాహన అవసరం



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ జయప్రకాష్

అనకాపల్లి టౌన్: మేధాభివృద్ధి, భాషాభివృద్ధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పూర్తి అవగాహన ఉండాలని జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ జయప్రకాష్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్ హైస్కూల్‌లో గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. త్వరలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ మురళి మనోహర్ పట్నాయక్, ఏసీడీపీవో ప్రభావతి, మండల విద్యాశాఖాధికారి ఎస్.కోటేశ్వరరావు, ఆర్‌పీ ఎస్.మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జ్ఞానజ్యోతి' శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన టీఎల్ఎం మెటీరియల్ ప్రదర్శన

కశింకోట: జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న బోధనా పద్ధతులను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుకు కృషి చేయాలని ఎంఈవో-2 కె.ఎస్.ఎస్.మూర్తి కోరారు. స్థానిక బాలికల హైస్కూల్‌లో ఐసీడీఎస్, విద్యా శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం మూడో రోజు గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానజ్యోతి కార్యక్రమం గురించి పిల్లల తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలన్నారు. మరో ఎంఈవో పి.వి.సురేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలకు శారీరక, భాష, మేధస్సు, సామాజిక, భావోద్వేగ, సృజనాత్మకతతో ఆడుతూ, పాడుతూ విద్యనందించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో టీఎల్ఎం మెటీరియల్ తయారు చేయించారు. వాటిని శిక్షణలో ప్రదర్శించారు. హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, జిల్లా రీసోర్స్ పర్సన్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ అల్లు స్వామినాయుడు ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా ఆదేశాల మేరకు కశింకోట పోలీసు స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోలో డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకోవడం నిషేధమన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, మద్యం సేవించి డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెంలకు చెందిన ఆటో డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి ఇంద్రజిత్ గుప్తాకు ఘన నివాళి



ఇంద్రజిత్ గుప్తా చిత్రం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి టౌన్: స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో దివంగత ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి ఇంద్రజిత్ గుప్తా వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పార్టీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరాచారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి, పార్టీ నాయకులు సత్యనారాయణ, పోతురాజు, శంకర్రావు, గురుబాబు, సూరిబాబు, బుజ్జి, సత్తిబాబు, జీవీ రావు, సింహాద్రి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ ఆ కుటుంబానికి రక్ష

- పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్
- పట్టణంలో పోలీసుల అవగాహన ర్యాలీ



హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ధనుంజయరావు, ఎస్సైలు

యలమంచిలి రూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వారి జీవితానికే కాదు ఆ కుటుంబానికి కూడా రక్షణ అని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ అన్నారు. జాతీర భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం యలమంచిలి పట్టణంలో సర్కిల్ పోలీసులు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడిపి ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసు, రవాణా అధికారులు జరిమానాలు విధిస్తారనే భయంతో కాకుండా స్వీయ రక్షణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ సూచించారు. రోడ్డు ప్రయాణం సాఫీగా సాగాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యలమంచిలి సీఐ ధనుంజయరావు కోరారు. ఇటీవల హెల్మెట్ ధరించిన వారు ప్రమాదాలకు గురైనపుడు ప్రాణాలతో బయటపడ్డారని, హెల్మెట్ ధరించని వారు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ట్రాఫిక్, రూరల్, పట్టణ ఎస్సైలు బి.రామకృష్ణ, ఎం.ఉపేంద్ర, కె.సావిత్రి, ఏఎస్సై చెల్లారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పించకపోతే భూములు తిరిగిచ్చేయండి



రైతులతో భూములు పరిశీలిస్తున్న ఏపీఐఐసీ ఆర్ఐ మురళీ కృష్ణ

అచ్యుతాపురం రూరల్ : స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేదంటే తమ భూములను తిరిగి ఇచ్చేయాలని దుప్పితూరు గ్రామ రైతులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం విశాఖపట్నం ఏపీఐఐసీ ఆర్ఐ మురళీకృష్ణ, ఆర్ఐ రవి దుప్పితూరు గ్రామ రైతుల భూములు, దేవస్థానం భూములను పరిశీలించారన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రత్యేక ఆర్థిక మండలి ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పి యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికి నేటికీ చాలా భూములు నిరుపయోగంగా ఉంచారన్నారు. ఆ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పకపోతే తమ భూములు వెనక్కి అప్పగించాలన్నారు. శ్రీభద్రావతి సమేత భావణా రుషి ఆలయ భూమికి నేటికీ నష్టపరిహారం చెల్లించలేదన్నారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆర్ఐ హామీ ఇచ్చారు.

వెదురుపర్తి హైస్కూల్‌లో భాషా పండగ



ఆంగ్ల భాషపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



బొమ్మల సహాయంతో ఆంగ్ల భాషపై అవగాహన

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం భాషా పండగ (లాంగ్వేజ్ ఫెస్టివల్) ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు కె.సబితలక్ష్మి, బోయిన చిన్నారావు ఇంగ్లీషుకు సంబంధించిన అంశాలను పాటలు, పద్యాలు, ఆటల రూపంలో విద్యార్థులకు వివరించి అవగాహన కలిగించారు. హెచ్ఎం ఎ.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ భాషా పండగలు పాఠశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థులకు చదవడం, రాయడం, వినడం, మాట్లాడటంలో పరిణతి పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. దీంతో పాటు నైపుణ్యం, విషయ అవగాహన, భాష మీద పట్టు సాధించవచ్చునన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ-1 సెక్షన్ పరిధిలో నిర్వహణ పనులు, కొత్త లైన్ల ఏర్పాటు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ ఏరియా, సరిసావారి, దాడి సూరిబాబు, స్టీల్‌ప్లాంట్ ఈశ్వరరావు, కోట్నీ నర్సింగరావు కల్లాలు ఏరియాలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ ఉద్యోగులకు సహకరించాలని ఆయన కోరారు.

ఉపమాక గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి వెంకటరావు

నక్కపల్లి: ఉపమాకలో ఉన్న గ్రామీణ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సిహెచ్.వెంకటరావు గురువారం తనిఖీ చేశారు. 2023-24 వార్షిక సంవత్సరానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు, పాఠకుల నుంచి డిపాజిట్లు సేకరించాలని లైబ్రేరియన్ జనార్దన్‌కు సూచించారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. పంచాయతీల నుంచి రావాల్సిన గ్రంథాలయ సెస్సు వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయంలో రికార్డుల నిర్వహణ తీరు, విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలు, కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రంథ పాలకుడు జనార్దన్‌ను అభినందించారు. గ్రంథాలయం ప్రహరీకి పెయింటింగ్ వేయించాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు.

నేడు విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం

- కొత్తపేట శివాలయంలో ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి



శివాలయంలో శిలా విగ్రహాలకు ధాన్యాధివాసం చేస్తున్న వేద పండితులు



పునఃప్రతిష్ట చేయనున్న విగ్రహాలు ఉంచిన చోట నీటిపై దేవతామూర్తుల ఆకారాలు సాక్షాత్కారం

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేట పురాతన శివాలయం పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంతో శుక్రవారం దేవతామూర్తుల శిలా విగ్రహాల పునః ప్రతిష్ట కార్యక్రమం చేపట్టడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. శివపార్వతులు, ఇతర దేవతామూర్తుల విగ్రహాల పునః ప్రతిష్ట క్రతువు ఈ నెల 17వ తేదీ నుంచి కొనసాగుతోంది. చివరి రోజు పునః ప్రతిష్ట, అష్ట బంధన మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తాండవకాశీ తపోవనం మఠాధిపతి పరమహంస సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి హాజరు కానున్నారు. పునః ప్రతిష్టలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట స్వామి చేతుల మీదుగా జరిపించడానికి ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు నిర్ణయించారు. ఇది పూర్తి కాగానే శుక్రవారం సాయంత్రం శివపార్వతుల శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.

మరో వైపు గురువారం విగ్రహ పునః ప్రతిష్ట క్రతువులో భాగంగా నాలుగో రోజు ధాన్యాధివాసం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ప్రాతరౌపాసన, నిత్యపూజ, వేద పారాయణలు, రుద్రహోమం నిర్వహించగా.. సాయంత్రం రుద్ర హోమం, మూలమంత్ర హోమం, వేద పారాయణ, పంచశయ్యాధివాసం, నీరాజనం, మంత్రపుష్పం చేశారు. ఈ కార్యక్రమంలో పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పెద్దింటి సూర్యనారాయణమూర్తి, బండారు సత్య బంగారుశెట్టి, సుందరపు బాబ్జీ, దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు.

అద్భుతం ఆవిష్కరణ

ఇక్కడ పునర్నిర్మించిన శివాలయంలో జలాధివాసం నిర్వహించిన తర్వాత విగ్రహాలు ఉంచిన చోట నీటిపై దేవతామూర్తుల ఆకారాలు కనిపించడం పరమశివుని ఆశీర్వాదం, కటాక్షంగా భక్తులు భావిస్తున్నారు. ఈ అద్భుత దృశ్యం చూసేందుకు భారీగా ఆలయానికి చేరుకున్నారు. ఓం నమః శివాయః మంత్రోచ్ఛారణనతో ఆ ప్రాంతం మార్మోగింది. ఇది చూసే భాగ్యం దక్కడం అదృష్టంగా అంతా భావించారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

అచ్యుతాపురం రూరల్ : ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు అధ్యక్షతన పంచాయితీ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నాణ్యమైన పరికరాలు అందించాలని కోరారు.